జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 30-07-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 741 పేజీలు: 4 వెల : రూ.7

# నేడు జిల్లాకు జగన్



✳ అంపోలు జైల్లో మాజీ మంత్రి అప్పలరాజుతో ములాఖత్ ✳ పర్యటన వివరాలు వెల్లడించిన వైసీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ✳ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు

**జగన్మోహన్ రెడ్డి పర్యటన వివరాలు..**
30న ఉదయం 9 గంటలకు తాడేపల్లి నుండి గన్నవరం ఎయిర్ పోర్ట్‌కు చేరుకుంటారు. 10.45 కి విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్ కు చేరుకుంటారు. 11 గంటలకు విశాఖపట్నం నుండి రోడ్ మార్గంలో బయలుదేరి మధ్యాహ్నం రెండు గంటలకు శ్రీకాకుళం అంపోలు జైలు వద్దకు చేరుకుంటారు. రెండు నుండి మూడు గంటల వరకు మాజీ మంత్రి అప్పలరాజుతో ములాఖత్ అవుతారు. మూడు గంటలకు బయలుదేరి ఐదు గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు.

శ్రీకాకుళం, జులై 29 (వార్త): మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్సిపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ఈనెల 30న శ్రీకాకుళం జిల్లాకు రానున్నారని వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణ దాస్ అన్నారు. నగరంలోని జిటి రోడ్ లో ఉన్న ఓ ప్రైవేట్ హోటల్లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి పర్యటన వివరాలను వెల్లడించారు. జిల్లాలో ఎన్నడూ లేని విధంగా మత్స్యకార సామాజిక వర్గం నుంచి సీదిరి అప్పలరాజుకు ఎమ్మెల్యే టికెట్ అందించి మంత్రిని చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నుంచి ప్రతిపక్షాలపై కుట్రలు పన్నుతూ కక్షపూరితంగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. వైయస్సార్సీపి శ్రేణులను అణగదొక్కడమే ధ్యేయంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని పేర్కొన్నారు. అందులో భాగంగానే సీదిరి అప్పలరాజు కుమారుడు రోడ్డు ప్రమాదం చేస్తే దాన్ని హత్య కేసుగా చిత్రీకరించి మాజీ మంత్రి అప్పలరాజును ఆయన కుమారున్ని అరెస్టు చేసి జైల్లో పెట్టి కూటమి ప్రభుత్వ నాయకులు రాక్షసానందం పొందుతున్నారన్నారు. సీదిరి అప్పలరాజుతో జగన్మోహన్ రెడ్డి ములాఖత్ అవుతారని తెలిపారు. రాష్ట్ర ప్రజలు అన్ని గమనిస్తున్నారని ఇటువంటి చీకటి రోజులు ఎన్నాళ్లు ఉండవని త్వరలోనే ప్రజలు కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హితవు పలికారు. మత్స్యకారులపై వైయస్ జగన్మోహన్ రెడ్డికి అపారమైన అభిమానం ఉందని, పాకిస్థాన్లో చిక్కుకున్న మత్స్యకారులను శ్రీకాకుళం రప్పించి వారిలో ధైర్యాన్ని, భరోసానీ నింపారని చెప్పారు. జిల్లాలో మత్స్యకారులకు శాశ్వత ఉపాధి ఉండాలన్న తలంపుతో బుడగట్లపాలెంలో 300 కోట్ల రూపాయలతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ పనులన్నింటిలోనూ మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు పాత్ర కీలకం అన్నారు. చంద్రబాబు నాయుడు మాత్రం ప్రతిపక్ష నాయకులపై కక్షపూరితంగా వ్యవహరించడం సరికాదన్నారు. అప్పలరాజు అరెస్టుకు నిరసనగా మత్స్యకారులంతా సంఘీభావం తెలపాలని కోరారు. ఈ పర్యటనలో జిల్లా వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్సీపీ శ్రేణులు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కృష్ణదాస్ కోరారు. ఈ విలేకరుల సమావేశంలో వైఎస్ఆర్సిపి నాయకులు అందవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్ , మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ ఎంవీ పద్మావతి, వైఎస్ఆర్సిపి నాయకులు పొన్నాడ రుషి, బుక్కురు ఉమామహేశ్వరరావు, సాదు వైకుంఠరావు, అంబటి శ్రీను, మండవిల్లి రవి, ఎన్ని ధనుంజయ, చల్లా శ్రీను, గుడ్ల దామోదర్ రావు, గొండు కృష్ణ, డిసిసిబి మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, బాన్న నర్సింగరావు, కిల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## బహిరంగ సభ, ర్యాలీ, రోడ్‌షోకు..
# అనుమతి లేదు

✳ జైలులో ఉన్న వ్యక్తిని పరామర్శించేందుకే జగన్మోహనరెడ్డికి అనుమతి ✳ ఎనిమిది వాహనాలతో కూడిన కాన్వాయ్‌కే.. ✳ ప్రజాప్రతినిధులు పోలీసు శాఖకు సహకరించాలి ✳ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు ✳ ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి




శ్రీకాకుళం, జులై 29 (వార్త): మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి శ్రీకాకుళం జిల్లా పర్యటనలో బహిరంగ సభలు, ర్యాలీలు, రోడ్ షోలు, ప్రజా సమావేశాలకు ఎటువంటి అనుమతి ఇవ్వడం లేదని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. జైలులో ఉన్న వ్యక్తిని పరామర్శించి వెళ్లేందుకు మాత్రమే పోలీసుల అనుమతి ఉందన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, ఆ పార్టీ ప్రతినిధులు మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి జిల్లా పర్యటనకు అనుమతి కోరుతూ దరఖాస్తు సమర్పించారన్నారు. దరఖాస్తులో బహిరంగ సభ, ర్యాలీ, రోడ్ షో లేదా ప్రజా సమావేశాల నిర్వహణకు ఎలాంటి అనుమతి కోరలేదన్నారు. అలాగే ఆ తరహా కార్యక్రమాలకు సంబంధించిన పూర్తి వివరాలు కూడా సమర్పించలేదని తెలిపారు. అందువల్ల అటువంటి కార్యక్రమాలకు అనుమతి ఇవ్వబడలేదన్నారు. ములాఖాత్‌కు అనుమతి మంజూరు చేసిన పక్షంలో, జైలులో ఉన్న వ్యక్తిని పరామర్శించి తిరిగి వెళ్లేందుకు మాత్రమే పోలీసు అనుమతి వర్తిస్తుందన్నారు. విశాఖపట్నం నుండి శ్రీకాకుళం అంపోలు జిల్లా జైలులో ఉన్న వ్యక్తిని ములాఖాత్ ద్వారా కలిసేందుకు సంబంధిత జైలు అధికారులు నిబంధనల ప్రకారం అనుమతిలు మేరకు ఆ పర్యటనకు అవసరమైన అనుమతులను శ్రీకాకుళం జిల్లా పోలీసులు కల్పిస్తారన్నారు. భారత ప్రధానమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని బహిరంగ సభలు, ర్యాలీలు, రోడ్ షోలు లేదా ప్రజలు పెద్ద సంఖ్యలో గుమికూడే కార్యక్రమాలకు అనుమతి లేదన్నారు. పర్యటన సందర్భంగా గరిష్టంగా 8 వాహనాలతో కూడిన కాన్వాయ్‌కు మాత్రమే అనుమతి ఇవ్వబడుతుందని చెప్పారు. ప్రజలు,రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పోలీసు శాఖకు సహకరించి శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. పోలీసు శాఖ విధించిన షరతులు లేదా చట్టబద్ధమైన నిబంధనలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే, సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకోబడతాయని ఎస్పీ హెచ్చరించారు.



# పీఎస్‌లో విచారణకు తమ్మినేని

✳ హైకోర్టు ఆదేశాల మేరకు రూరల్ పీఎస్‌లో ఈఓ ఎదుట హాజరు ✳ భూకొనుగోలుపై ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఎంక్వయిరీ ✳ పలు ప్రశ్నలు వేసిన ఎంక్వయిరీ అధికారి

శ్రీకాకుళం, జులై 29 (వార్త): భూ కబ్జా వ్యవహారానికి సంబంధించి నమోదైన కేసులో విచారణకి మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం బుధవారం శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎంక్వయిరీ అధికారి ముందు హాజరయ్యారు. ఈ కేసులో మధ్యంతర ముందస్తు బెయిల్‌ను తమ్మినేని పొందిన విషయం తెలిసిందే. హైకోర్టు సూచనల మేరకు విచారణ అధికారి ఎదుట హాజరుకాగా, సుమారు నాలుగు గంటల పాటు విచారణ అధికారిగా ఉన్న ఎస్ఐ సురేష్.. తమ్మినేని సీతారాంను భూ వివాదానికి సంబంధించి పలు ప్రశ్నలు వేసినట్టు తెలిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ తమ్మినేని సీతారాం స్టేషన్ వద్దనే ఉన్నారు. తమ నాయకుడు విచారణకి హాజరుకాగా ఆయనకి మద్దతుగా పలువురు అనుచరులు స్టేషన్ వద్దకు వచ్చారు. ఆయనను విచారిస్తున్న సేపు బయట వారు వేచి ఉన్నారు. మరోసారి విచారణకు రావాల్సివుంటుందని విచారణ అధికారి.. తమ్మినేనికి సూచించినట్టు తెలిసింది.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# దానయ్య కుటుంబానికీ న్యాయం చేయాలి

**- ప్రమాదం కేసు వక్రీకరణతో యాదవ కుటుంబానికి అన్యాయం జరిగిందని ఆరోపణ**

**- పరామర్శలకే పరిమితం కాకుండా బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి**

**- మాజీ సీఎం జగన్‌కు బీసీ సెల్ అధ్యక్షుడు లొడగల విజ్ఞప్తి**

**పలాస, జులై 29 (వార్త):** పలాసలో హిట్ అండ్ రన్ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన గొర్రెల కాపరి దానయ్య కుటుంబానికి న్యాయం చేయాలని రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు లొడగల కామేశ్వరరావు యాదవ్ డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పలాస పర్యటన సందర్భంగా మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుటుంబాన్ని పరామర్శించడంతో పాటు, ప్రమాదంలో మృతి చెందిన దానయ్య కుటుంబాన్ని కూడా తప్పకుండా పరామర్శించాలని బహిరంగంగా విజ్ఞప్తి చేశారు. టీడీపీ పట్టణ కార్యదర్శి సప్ప నవీన్‌తో కలిసి బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన, ప్రమాదం అనంతరం కేసు దర్యాప్తు, పోలీసుల వ్యవహారశైలి కారణంగా బాధిత కుటుంబానికి అన్యాయం జరిగిందని ఆరోపించారు. ప్రమాదం కేసును వక్రీకరించడం వల్ల యాదవ సమాజం మోసపోయిందని, ఇప్పటికీ దానయ్య కుటుంబానికి పూర్తి స్థాయిలో న్యాయం అందలేదని విమర్శించారు. రాజకీయ నాయకుల ఇళ్లను మాత్రమే పరామర్శించడం ప్రజల్లో తప్పుడు సంకేతాలను పంపుతుందని కామేశ్వరరావు అన్నారు. ప్రమాదంలో కుటుంబ పెద్దను కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న దానయ్య కుటుంబాన్ని కూడా మాజీ ముఖ్యమంత్రి పరామర్శించి భరోసా కల్పించాలని కోరారు. వైసీపీ నాయకత్వం ఇప్పటి వరకు బాధిత కుటుంబాన్ని ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించిన ఆయన, ప్రజా ప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా బాధితులకు అండగా నిలవాల్సిన బాధ్యత ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రిగా పనిచేసిన జగన్‌మోహన్ రెడ్డి దానయ్య కుటుంబం పరిస్థితిని కూడా గుర్తించి స్పందించాలని విజ్ఞప్తి చేశారు. దానయ్య కుటుంబానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా పలువురు సహాయం అందించేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. టీడీపీ, మంత్రి కొలుసు పార్థసారథి, పలువురు ప్రజాప్రతినిధులు, యూట్యూబ్ ఛానళ్ల ప్రతినిధులు, యాదవ సంఘాల నాయకులు కుటుంబానికి అండగా నిలిచారని పేర్కొన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు బాధిత కుటుంబానికి నైతిక, ఆర్థిక సహాయం అందించాలని, రాజకీయ పరామర్శలకే పరిమితం కాకుండా మానవత్వంతో వ్యవహరించాలని కామేశ్వరరావు పిలుపునిచ్చారు. దానయ్య కుటుంబానికి పూర్తి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో లొడగల కామేశ్వరరావు యాదవ్, అంబటి కృష్ణమూర్తి, సప్ప నవీన్, కొరికాన శంకరరావు, దాసరి దాశరథి, అవుగాన దశరథ, కొండే నరసింహులు, ఉంగ భుజంగరావు, సూళ్ల చిట్టిబాబు, అవుగాన తిరుపతి, దాసరి చిన్నారావు, కొండే తిరుపతి, డొక్కరి అప్పారావు, బద్రి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా 'ప్రేమతరూ' నర్సరీ ప్రారంభం



**పలాస, జులై 29 (వార్త):** శ్రీ సత్యసాయి సేవాసంస్థలు ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'శ్రీ సత్యసాయి ప్రేమతరూ' కార్యక్రమంలో భాగంగా గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని రామకృష్ణపురంలోని శ్రీ సత్యసాయి విద్యావిహార్‌లో మామిడి, నేరేడు, పనస మొక్కల నర్సరీని బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 2,000 మామిడి టెంకలు, పనస పిక్కలు, నేరేడు గింజలను భక్తుల నుంచి సేకరించి శుద్ధి చేసిన అనంతరం విద్యార్థులతో నాటించారు. పర్యావరణ పరిరక్షణలో మొక్కల ప్రాధాన్యం, వాటి అవసరాన్ని విద్యార్థులకు వివరించారు. ప్రస్తుతం నాటిన విత్తనాలను మొక్కలుగా పెంచి భవిష్యత్తులో ప్రజలకు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు, ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రేమతరూ ఇన్‌చార్జి బోయిన చంద్రమౌళి, గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు గోపాల్, జిల్లా పదాధికారులు నాగేశ్వరరావు, నరసింహమూర్తి, సుజాత, ఉపాధ్యక్షులు తాలసు శ్రీను, శరత్, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి, ఉపాధ్యాయులు అనుదీప్, చంద్రశేఖర్, సింహాచలం, రష్మిత, ఆషా, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల చేతుల్లోనే ఓటు!




**పలాస, జులై 29 (వార్త):** ప్రజాస్వామ్య వ్యవస్థ గొప్పతనాన్ని విద్యార్థులకు ప్రత్యక్షంగా పరిచయం చేస్తూ వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థి నాయకుని ఎన్నికలను ఓటింగ్ విధానంలో నిర్వహించారు. విద్యార్థులనే ఓటర్లుగా చేసి, ఓటు హక్కు వినియోగం నుంచి ఓట్ల లెక్కింపు వరకు ఎన్నికల ప్రక్రియను దశలవారీగా వివరించి అవగాహన కల్పించారు. ఎన్నికల అనంతరం జరిగిన ఓట్ల లెక్కింపులో బి. దీక్ష పాఠశాల విద్యార్థి నాయకుడు (ఎస్‌పీఎల్)గా ఎన్నికయ్యారు. అనంతరం ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. హేమరావు ఆధ్వర్యంలో నిర్వహించగా, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు కె. రమణ, టి. కమలకుమారి ఎన్నికల అధికారులుగా వ్యవహరించి ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ బి. లక్ష్మీపతితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏటి బట్టి నీరు విడుదల



**సోంపేట, జులై 29(వార్త):** బారువ మేజర్ పంచాయతీ రైతులకు ఖరీఫ్‌కు అవసరమైన ఏటిబట్టి నీటిని బుధవారం పూజా కార్యక్రమాలు నిర్వహించి రైతులు స్వయంగా విడుదల చేశారు. అనేక ఎకరాలలో వరి పంట సాగుకు ఈ నీరు దోహదపడుతుంది. సాగునీరుకు అవరోధాలు లేకుండా చక్కనైన వర్షాలతో పంటలు పచ్చగా పండాలని పూజలు చేపట్టారు. రైతు సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## సత్యసాయి మందిరంలో ఘనంగా గురు పౌర్ణమి

**సోంపేట, జులై 29(వార్త):** సోంపేటలోని శ్రీ సత్యసాయి మందిరంలో గురు పౌర్ణమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్య సాయి భజన మండలి ఆధ్వర్యంలో స్వామివారికి నీరాజనం సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసుతో పాటు పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.



# సాయినాథుడి సన్నిధిలో గురుపౌర్ణమి వేడుకలు





**పలాస, జులై 29 (వార్త):** పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని శివాజీనగర్ షిరిడి సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, గురుపూజలు వేదమంత్రోచ్చారణల మధ్య నిర్వహించగా, ఆలయం భక్తజన సందోహంతో కళకళలాడింది. ప్రత్యేకంగా అలంకరించిన సాయిబాబా ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శనం చేసుకుని ఆశీస్సులు పొందారు. ఆలయ ధర్మకర్త దువ్వాడ శ్రీధర్ (బాబా) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో పురోహితుడు ధర్మపురి వాయానంద శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుపౌర్ణమి విశిష్టతను వివరిస్తూ గురుభక్తి, సేవాభావం, ధర్మాచరణ మానవ జీవితానికి మార్గదర్శకాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. మహా మంగళహారతి అనంతరం ఆలయానికి విచ్చేసిన వేలాది మంది భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. భక్తులు క్రమశిక్షణతో ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ ప్రాంగణమంతా సాయినామస్మరణ, భజనలు, భక్తిగీతాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వేడుకల నిర్వహణలో ఆలయ కమిటీ సభ్యులు, సేవాదళం, వాలంటీర్లు విశేష సేవలందించారు. పలాసతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని గురుపౌర్ణమి వేడుకలను విజయవంతం చేశారు.

# పాడి రైతు కష్టానికి ప్రతిఫలం ఇప్పించండి

**- ఎం జె పూలే బీసీ సంఘం డిమాండ్**

**- రైతులతో కలిసి పోరాటం ప్రారంభం**



**సోంపేట, జులై 29(వార్త):** రాష్ట్రంలో లక్షలాదిమంది పాడి రైతులు నిరంతరం ఆర్థికంగా విపరీత పెట్టుబడులు పెట్టి పశువులను పెంచుతూ వ్యవసాయ రంగానికి అండగా నిలుస్తున్న నేపథ్యంలో ఆయా ఆవుల నుంచి ఎన్నో ఇబ్బందుల నడుమ రైతులు సేకరిస్తున్న పాల ధర విషయంలో కార్పొరేట్ కంపెనీలు రైతాంగానికి చాలా అన్యాయానికి గురి చేస్తున్నాయని ఎం జె పూలే రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు బీన ఢిల్లీ రావు పేర్కొన్నారు. సామాన్యులకు మంచినీరు లీటరు 20 రూపాయలకు విక్రయిస్తున్నప్పటికీ నాణ్యమైన పాలన మాత్రం లీటర్ 32 రూపాయలకు మాత్రమే సేకరించడం తీవ్ర అన్యాయమని పేర్కొన్నారు .వెంటనే పాల ధరలను పెంచాలని ప్రభుత్వానికి డిమాండ్ చేసారు . పాల ఉత్పత్తి వ్యయం, రైతుల శ్రమ పరిగణలోకి తీసుకొని ధరను నిర్ణయించాలన్నారు. పాలలోని క్రీం ఇతర విలువ ఆధారిత పాల ఉత్పత్తుల ద్వారా డైరీలు సాధించే అదనపు ఆదాయాన్ని కూడా ధర నిర్ణయం లో పరిగణించాలన్నారు.

పాల ఉత్పత్తి ధరలను నిరంతరం సమీక్షించేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలి. పశువుల మేత, పశువైద్య సేవలు, పాడి పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన సబ్సిడీలు,ఆర్థిక సహాయాన్ని అందించాలి. ఈ డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేస్తూ పశు సంవర్ధక శాఖ ప్రధాన కార్యదర్శి కి, ఏపీ డైరీ డెవలప్మెంట్ కోపరేటివ్ ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కు, వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శికి ఈ సంఘం ద్వారా ఈరోజు లేఖలు పంపించినట్లు ఢిల్లీరావు తెలిపారు. అలాగే కవిటి ఉద్దానం గ్రామాల్లో ఈరోజు పాల రైతుల నుంచి సంతకాలు సేకరణ కూడా చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీన ఢిల్లీ రావు తో పాటు పొందూరు నారాయణ, బంగారు రామారావ్ యాదవ్, ఎర్ర సోమనాథ్, బింగి కూర్మారావు, బొగియా పద్మనాభం,ఈరోతు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**-మందసలో ఇంటింటికీ శిరీషా**

**ప్రజలతో మమేకమైన ఎంఎల్ఏ గౌతు**

**మందస, జులై 29(వార్త):** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పలాస నియోజకవర్గం శాసనసభ్యురాలు గౌతు శిరీషా అన్నారు. మందస పట్టణంలో ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ శిరీషా మాట్లాడుతూ గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరవేస్తూ ప్రజలతో ప్రత్యక్షంగా మమేకం కావడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వారి అభిప్రాయాలు, సూచనలు తెలుసుకుని మరింత సమర్థవంతమైన, పారదర్శకమైన పాలన అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీషా ప్రతి ఇంటికీ వెళ్లి, ప్రజలను ఆప్యాయంగా పలకరించి, వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ, ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పన, తాగునీరు, రహదారులు, విద్య, వైద్యం వంటి అంశాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి అభిప్రాయాలు తెలుసుకోవడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు, పీఏసీఎస్ చైర్మన్ లు, క్లస్టర్ కన్వీనర్లు, కోకన్వీనర్లు, యూనిట్ కన్వీనర్లు, యూనిట్ కోకన్వినర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# పారదర్శక పాలనతో సమస్యల పరిష్కారానికి కృషి



**మెళియాపుట్టి, జులై 29 (వార్త):** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోనే కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో పారదర్శక పాలన అందిస్తూనే గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ అభివృద్ధి చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలో గల మర్రిపాడు సి గ్రామంలో బుధవారం నాడు ఇంటింటి ప్రచారంలో భాగంగా కూటమి ప్రభుత్వ పాలల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సంక్షేమ పథకాలలో ప్రజలకు భాగస్వామ్యం చేస్తూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న రెండేళ్ల నమ్మకంలో సంక్షేమ విజయాలు, ప్రజా పాలన, ఇంటింటికీ అభివృద్ధి, తదితర అంశాలతో ముందుకు సాగుతున్న విధానాన్ని ప్రజలతో మాట్లాడుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు కార్మికులు సహా అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాలభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, విద్యుత్, వ్యవసాయ రంగాల్లో గణనీయమైన పురోగతి సాధిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటుగా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## మందసలో విద్యార్థులకు కంటి పరీక్షలు



**మందస, జులై 29(వార్త):** మందస పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల ఎంపీపీఎస్ బీసీ స్కూల్ లో జాతీయ ఆంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఆంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 155మంది విద్యార్థులకు మందస మండల నేత్ర వైద్యాధికారి రోణంకి వెంకటరమణ కంటి పరీక్షలు జరిపారు. దృష్టి లోపం ఉన్న నలుగురుకి కంటి అద్దాలకు సిఫార్సు చేశారు. కంటి వ్యాధులు, నేత్ర సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు ఎస్.మల్లేసు అధ్యక్షతన జరిగింది. ఎంఎల్ హెచ్ పీ కె.విజయశ్రీ, ఆశా డి.కుమారి, జి.హేమలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శిథిలావస్థకు చేరిన ఎంఆర్సీ కార్యాలయం

**- ఆరేళ్లుగా వినియోగానికి దూరం**

**-మరమ్మతులపై అధికారుల నిర్లక్ష్యం**

**- పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికుల విజ్ఞప్తి**

**నరసన్నపేట, జులై 29(వార్త):** ప్రభుత్వ భవనాల నిర్వహణలో సంబంధిత శాఖల నిర్లక్ష్యం కారణంగా పలు భవనాలు శిథిలావస్థకు చేరుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నరసన్నపేట మండల కేంద్రంలోని విద్యాశాఖకు చెందిన మండల వనరుల కేంద్రం (ఎంఆర్సీ) కార్యాలయ భవనం గత ఆరు సంవత్సరాలుగా వినియోగానికి దూరంగా ఉండడం దీనికి నిదర్శనంగా నిలుస్తోంది. ఒకప్పుడు విద్యాశాఖ పరిపాలనా కార్యకలాపాలకు ఉపయోగపడిన ఈ భవనం ప్రస్తుతం నిర్వహణ లేక వెలవెలబోతోంది. భవనంలో తగిన మరమ్మతులు చేపట్టకపోవడంతో రోజురోజుకూ దాని పరిస్థితి మరింత దిగజారుతోందని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు భవనాన్ని పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టడంలో చొరవ చూపడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నప్పటికీ, పర్యవేక్షణ లోపంతో విలువైన భవనాలు నిరుపయోగంగా మారుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కనీస మరమ్మతులు చేపడితే భవనాన్ని తిరిగి వినియోగంలోకి తీసుకురావచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. విద్యాశాఖ అవసరాలకు లేదా ఇతర ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు ఈ భవనాన్ని ఉపయోగించుకునే అవకాశం ఉందని సూచిస్తున్నారు. ప్రభుత్వ ఆస్తుల సంరక్షణపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, ఎంఆర్సీ కార్యాలయ భవనాన్ని త్వరితగతిన పునరుద్ధరించి ప్రజా ప్రయోజనాలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## మూడున్నర దశాబ్దాలైనా ..

# అద్దె భవనంలోనే బీసీ వసతిగృహం

**-విద్యార్థులకు తప్పని ఇబ్బందులు**
**-శాశ్వత భవనం నిర్మించాలని గ్రామస్థులు, విద్యార్థుల విజ్ఞప్తి**

**జలుమూరు, జులై 29(వార్త):** శ్రీముఖలింగం గ్రామంలో మూడు దశాబ్దాల క్రితం మంజూరైన బీసీ బాలుర వసతి గృహానికి నేటికీ సొంత భవనం లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు 60 మంది విద్యార్థులు ఈ వసతి గృహంలో ఉంటుండగా, సరైన భవనం లేక రెండు వేర్వేరు అద్దె గృహాల్లో వసతి కల్పిస్తున్న పరిస్థితి నెలకొంది. విద్యార్థులకు అవసరమైన వసతి, మౌలిక సదుపాయాలు లేకపోవడంతో పాటు వసతి గృహాన్ని పర్యవేక్షించే ప్రత్యేక అధికారి లేకపోవడం వల్ల పలు సమస్యలు ఎదురవుతున్నాయని విద్యార్థులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు చోట్ల వసతి కల్పించడంతో విద్యార్థుల పర్యవేక్షణ, నిర్వహణ కూడా ఇబ్బందికరంగా మారిందని పేర్కొంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా బీసీ వసతి గృహానికి శాశ్వత భవనం నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధమైనప్పటికీ, ప్రభుత్వం మారిన అనంతరం ఆ ప్రతిపాదనలు ముందుకు సాగకుండా నిలిచిపోయాయని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ సమస్యపై గ్రామస్థులు, మాజీ సర్పంచ్ పలుమార్లు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపిస్తున్నారు. గ్రామ, నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు కూడా సమస్య పరిష్కారంపై దృష్టి సారించకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి బీసీ వసతి గృహానికి శాశ్వత భవనం నిర్మించి విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించాలని గ్రామస్థులు, విద్యార్థులు, ఫిర్యాదుదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. విద్యాభ్యాసానికి అనుకూల వాతావరణం కల్పించేందుకు ఈ సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని కోరుతున్నారు.



## క్విజ్ పోటీ విజేతలకు బహుమతులు



**ఇచ్ఛాపురం, జులై 29 (వార్త):** మారుతి జ్యోతిర్విద్యా నిలయం గ్రంథాలయం ఆధ్వర్యంలో గురు(వ్యాస) పౌర్ణమి సందర్భంగా జరిగిన భారతీయ సంస్కృతి ప్రహేళికలో 6పాఠశాలల నుండి 453 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరికి బహుమతులు అందజేశారు. డి.ప్రవీణ్ కుమార్, 9వ తరగతి, జ్ఞానభారతి ఇ.ఎం. స్కూల్, సుగ్గు కళ్యాణి, 9వ తరగతి, మున్సిపల్ హైస్కూల్, పురుషోత్తపురం, డి. మీనాక్షి, 7వ తరగతి, పురపాలక బాలికోన్నత పాఠశాల, ఎం. నాగేశ్వరి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల,కె. సమీర, 9వ తరగతి, మున్సిపల్ హైస్కూల్, రత్తకన్న, బి. చరిష్మ, 10వ తరగతి, శాంతినికేతన్ ఇ. ఎం. స్కూల్ స్పెషల్ ప్రైజ్ డి. రక్షిత, 9వ తరగతి, ఒరియా భాషలో వ్రాసిన వారిలో కార్తీక్ రౌళో, 8వ తరగతి జ్ఞానభారతి ఇ. ఎం. స్కూల్ , హిందీ భాషలో రాసిన వారిలో సోనాక్షి సాహు, 9వ తరగతి, జ్ఞానభారతి ఇ ఎం స్కూల్, తృతీయ బహుమతి సి. హెచ్ హాసిని, మున్సిపల్ హైస్కూల్, పురుషోత్తపురం, ద్వితీయ బహుమతి కె. పద్మావతి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రథమ బహుమతి ఇసురు సౌభాగ్యవతి 9వ తరగతి జ్ఞానభారతి ఇ. ఎం. స్కూల్ లు విజేత లు గా నిలిచారు. పొట్టా తాయారమ్మ , పరపటి జయలక్ష్మి, పండి ఢిల్లేశ్వరరావు ముగ్గురు విశ్రాంత ఉపాధ్యాయులను గురుపూజ చేసి సన్మానించారు. తెన్నేటి తేజేశ్వర శర్మ నిర్వహించిన ఈ కార్యక్రమానికి డా. క్రిష్ణ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అధ్యక్షత వహించారు. జోహార్ ఖాన్ అతిథిగా, వక్తగా వ్యవహరించారు. వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజలు వచ్చి కార్యక్రమం జయప్రదం చేసారు కార్యక్రమములో పాల్గొన్న విద్యార్థులకు వెచ్చావారి కామేశ్వరి జ్యూయలర్స్ ప్రొప్రైటర్ డా. వెచ్చా సంతోష్ పుస్తకాలు అందించారు. తెన్నేటి తేజేశ్వర శర్మను పలువురు అభినందించారు.

## జేసీఐ ప్రొవిజనల్ జోన్ ట్రైనర్‌గా పల్లంటి చిరంజీవి



**ఇచ్ఛాపురం, జులై 29 (వార్త):** కాకినాడలో నాలుగు రోజులు పాటు జరిగిన జె సి ఐ జోన్ ట్రైనర్స్ వర్క్ షాప్ ( అర్హత పరీక్ష) లో ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన పల్లంటి చిరంజీవి ప్రొవిజినల్ జోన్ ట్రైనర్ గా అర్హత సాధించారు. అవుట్ స్టాండింగ్ పెర్ఫార్మర్ ( అత్యుత్తమ నైపుణ్యాల ప్రదర్శకునిగా) ప్రత్యేక అవార్డు గెలుచుకున్నారు . ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు కాకినాడలో నాలుగు రోజులు పాటు జెడ్ టి హెచ్ 26 - వర్క్ షాప్ జరిగింది. ఈ వర్క్ షాప్ ఫలితాలను వెల్లడించారు. ఈ వర్క్ షాప్ లో ఆంధ్ర, రాయలసీమ,తెలంగాణ ప్రాంతాలకు చెందిన అనేకమంది హాజరయ్యారు. ఈ శిక్షణలో బోధించిన అంశాలపై శిక్షణ పొందుతున్న వారితో అక్కడకక్కడే నేరుగా ప్రదర్శన చేయించి వారి నైపుణ్యాలను మూల్యాంకన చేసి మార్కులు కేటాయిస్తూ శిక్షణ పొందుతున్న వారి సామర్థ్యాలను అంచనా వేశారు. వర్క్ షాప్ పూర్తయిన అనంతరం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో పల్లంటి చిరంజీవికి అవుట్ స్టాండింగ్ ఫర్ఫార్మర్ అవార్డును అందించారు. మొదటి రోజు నుంచి చివరి రోజు వరకు నిలకడగా అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ, అందరిలోనూ ఉత్తమంగా నిలిచే వారికి ఈ అవార్డు అందిస్తారు. జోన్ ట్రైనర్స్ వర్క్ షాప్ కు హాజరు కావడానికి స్పీచ్ క్రాఫ్ట్ వర్క్ షాప్ లో అర్హత సాధించడం తప్పనిసరి. గత ఏడాది జరిగిన స్పీచ్ క్రాఫ్ట్ వర్క్ షాప్ లో సైతం ప్రదర్శించిన అత్యుత్తమ ప్రదర్శనకు గాను బెస్ట్ అవుట్ స్టాండింగ్ పెర్ఫార్మర్ అవార్డును కూడా గెలుచుకోవడం విశేషం. ప్రొవిజనల్ జోన్ ట్రైన్ గా అర్హత సాధించిన పల్లంటి చిరంజీవిని జేసీఐ వైజాగ్ వారియర్స్, జె సి ఐ ఇచ్ఛాపురం క్లబ్ అధ్యక్షులు, ప్రతినిధులు అభినందనలు తెలియజేశారు.

## షిరిడిగిరిపై గురుపౌర్ణమి మహోత్సవాలు

**మెళియాపుట్టి, జులై 29 (వార్త):** మెళియాపుట్టిలోని శిరిడిగిరి ఆలయంలో బుధవారం నాడు గురుపౌర్ణమి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో భక్తులు, ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు నిర్వహించారు. షిరిడి సాయి ఆలయంలో వేదమంత్రోచ్ఛారణల మధ్య మహాభిషేకం, అర్చనలు, అష్టోత్తర శతనామ పూజ, ప్రత్యేక హారతులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్న సమయంలో అన్నదాన కార్యక్రమాన్ని సైతం ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులతో పాటు భక్తులు మహిళలు గ్రామస్తులు పరిసర ప్రాంత ప్రజలు తదితరులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించి భక్తి గీతాలు ఆలపన, భజన, దైవ నామస్మరణ తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



# పీఆర్‌సీని వెంటనే నియమించాలి



**మందస, జులై 29(వార్త):** రాష్ట్రంలో కొత్త పీఆర్సీ కమిషన్‌ను ప్రభుత్వం వెంటనే నియమించాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు డిమాండ్ చేశారు. యూటీఎఫ్ మందస మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన 'సభ్యత్వ నమోదు - సమస్యల స్వీకరణ' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరిపురం, జి.ఆర్.పురం, బైరిసారంగపురం, మందస, సొండిపూడి, కొత్తపల్లి పాఠశాలలను సందర్శించి, ఉపాధ్యాయుల క్షేత్రస్థాయి సమస్యలను నేరుగా తెలుసుకుంటూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం విజయవాడ వేదికగా వేలాది మందితో పలుమార్లు 'రణభేరి' నిర్వహించినా, ప్రభుత్వం నుంచి ఆశించిన స్పందన రాకపోవడం శోచనీయమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్నాళ్లవుతున్నా పీఆర్సీ కమిషన్ వేయకుండా కాలయాపన చేయడం సరికాదని విమర్శించారు.

### ప్రధాన డిమాండ్లు ఇవే...

వెంటనే నూతన పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, మధ్యంతర ఉపశమనం(ఐఆర్) తక్షణమే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ (డీఏ)లు, ఇతర ఆర్థిక బకాయిలను వెంటనే జమ చేయాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఉపాధ్యాయుల న్యాయమైన కోరికలను తీర్చకపోతే పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జయరాం మాలి, మందస మండల అధ్యక్షుడు జగదీష్ బడిత్య, ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరరావు, కోశాధికారి సోమనాథ్ సిస్టు, గౌరవాధ్యక్షుడు జన్ని సోమేశ్వరరావు, జిల్లా కౌన్సిలర్లు తరిణి సోమేశ్వరరావు, గున్న చంద్రశేఖర్ తదితర నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# టీడీపీ బలోపేతమే లక్ష్యం



**శ్రీకాకుళం, జులై 29 (వార్త):** శ్రీకాకుళం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యాలయంలో పార్లమెంటరీ స్థాయి సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ఆముదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పియూసీ చైర్మన్ కూన రవికుమార్ హాజరయ్యారు.

పార్టీ రాష్ట్ర నాయకత్వం తరపున అబ్జర్వర్‌గా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో జిల్లాలో పార్టీ సంస్థాగత బలోపేతం, గ్రామస్థాయి కమిటీల పనితీరు, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన కార్యక్రమాలు, అలాగే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లే కార్యాచరణపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ, ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేయడంతో పాటు కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వివరించాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారంలో పార్టీ శ్రేణులు ఎల్లప్పుడూ ముందుండాలని, ప్రభుత్వానికి--ప్రజలకు మధ్య వారధిగా పనిచేయాలని సూచించారు. అబ్జర్వర్ కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని పేర్కొన్నారు. పార్టీ అధిష్ఠానం నిర్దేశించిన కార్యాచరణను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి, ప్రజల్లో పార్టీపై మరింత విశ్వాసం పెంచేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో పార్లమెంటరీ పరిధిలోని ఎమ్మెల్యేలు, జిల్లా పార్టీ కమిటీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## వెంకటరమణ కుటుంబానికి రామచంద్రయాదవ్ ఆర్థిక సాయం

**మందస, జులై 29(వార్త):** లొహరిబంద గ్రామానికి చెందిన నర్తు వెంకటరమణ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. వెంకటరమణ మరణంతో ఆయన కుటుంబం దిక్కులేనిదిగా మారింది. విషయం తెలుసుకున్న భారత చైతన్య యువజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ వెంకటరమణ కుటుంబాన్ని పరామర్శించారు. రూ.40,000 రూపాయలు ఆర్థిక సాయంగా అందజేశారు. అనంతరం ఆయనను యాదవ నాయకులు దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమం మాజీ జడ్పీటీసీ అందాల శేషగిరిరావు, యాదవ సంఘము నాయకులు రాపాక చిన్నారావు, బద్రి సీతమ్మ, మాజీ సర్పంచ్ లు గుసిరి వెంకటరావుయాదవ్, మద్దిలి రామారావు, మాజీ ఎంపీటీసీ మామిడి క్రిష్ణారావు, ముడిమించి ఈశ్వరరావుయాదవ్, ఎంపీటీసీ కొరికాన సుమలతవల్లభరావు, యాదవ కుల పెద్దలు పాల్గొన్నారు.



## రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ క్యాంపు కార్యాలయం ప్రారంభం



**ఇచ్ఛాపురం, జులై 29 (వార్త):** రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ కొండ శంకర్ రెడ్డి క్యాంపు కార్యాలయం ప్రారంభించారు. టూరిజం పార్కు పక్కన ఏర్పాటు చేసిన కార్యాలయం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బెందాలం అశోక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో పట్టణ అధ్యక్షులు పత్రి తవిటయ్య,మండలం అధ్యక్షులు లోపింటి పద్మనాభం, ఏ ఎం సి చైర్మన్ మణి ప్రకాష్, మేరుగు సూర్యనారాయణ రెడ్డి, పెదిని బాబ్జి సదానందం రౌలో, గిన్ని బాలరాజు, శేఖర్, సహదేవ్ రెడ్డి,, పొందల కృష్ణా రావు తదితరులు పాల్గొన్నారు.

## ధనుంజయ రెడ్డికి ఘనంగా సన్మానం



**ఇచ్ఛాపురం, జులై 29 (వార్త):** టి.బరంపురం గ్రామానికి చెందిన ప్రముఖ జానపద సంగీత కోలాటం గురువు తిప్పన ధనంజయ రెడ్డిని గురు పౌర్ణమి సందర్భంగా నీలాపుపుట్టుగ , సన్యాస పుట్టుగ , గుడ్డిపద్ర, మశాకపురం తదితర గ్రామాలలో ఆయన్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లిరావు, బోర చెన్నారావు, బాగా జయ పతి , నరేంద్ర, బాగా మోహన్ రావు, వివిధ పాఠశాలలకు సంబంధించిన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయనీలు కోలాటం సభ్యులు, ఆర్గనైజర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు వితరణ



**ఇచ్ఛాపురం, జులై 29 (వార్త):** గురుపౌర్ణమి సందర్భంగా జీఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభాగ్యులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమం పాతిర్ల గిరిబాబు రెడ్డి అనపాన శ్రీరామ్ రెడ్డి ఆర్థిక సహాయంతో నిర్వహించారు.

## బీజేపీ ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలు



**ఇచ్ఛాపురం, జులై 29 (వార్త):** వ్యాస పూర్ణిమ (గురు పూర్ణిమ) సందర్భంగా భారతీయ జనతా యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ముడియా. రంగనాధ్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చింతాడ శరత్ బాబు గారిని ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యురాలు నీలవేణి యువమోర్చా సభ్యులు ఉమ్మడి ఢిల్లీ, జగన్ పట్నాయక్, నీలాపు మహేష్, శ్రీపెరంబదూర్ డిల్లీ, సాడి ధను తదితరులు పాల్గొన్నారు.

## భోగాపురం ఎయిర్‌పోర్టుపై పోటీలు

**ఇచ్ఛాపురం, జులై 29 (వార్త):** రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ఆదేశానుసారం ఇచ్ఛాపురం మండల స్థాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్థాయి విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, క్విజ్ పోటీలు ఇరువురు మండల విద్యాశాఖాధికారులు అధ్యక్షతన నిర్వహించారు బోగా పురం ఎయిర్ పోర్టు ప్రారంభం సందర్భంగా పోటీలు నిర్వహించారు . ఈ పోటీల్లో డ్రాయింగ్ విభాగంలో కె.శాసనం కు చెందిన బి.సంతోషి, వ్యాసరచన విభాగంలో ఇచ్ఛాపురం మున్సిపల్ బాలికొన్నత పాఠశాల కు చెందిన బి.నీరజ, క్విజ్ విభాగంలో ఇచ్ఛాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన జి. చరణ్ ప్రథమ స్థానంలో నిలిచారు. విజేతలను ఇరువురు మండల విద్యాశాఖాధికారులు కాకర సూర్యారావు, ఎస్. విశ్వనాథం తో పాటు పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. విజేతలు జిల్లాస్థాయి పోటీలకు హాజరవుతారని మండల విద్యాశాఖాధికారులు తెలియజేశారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ఆరేళ్లుగా సా..గుతున్న ప్రసూతి వార్డు నిర్మాణం

**-రూ.12.56 కోట్లతో చేపట్టిన పనులు నత్తనడకన**

**- డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని అధికారుల హామీ**

**నరసన్నపేట, జులై 29 (వార్త):** నరసన్నపేట ఏరియా ఆస్పత్రి పరిధిలో గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రూ.12.56 కోట్ల వ్యయంతో చేపట్టిన ప్రత్యేక ప్రసూతి వార్డు నిర్మాణ పనులు ఆరేళ్లుగా పూర్తికాకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గర్భిణులకు ఆధునిక సౌకర్యాలతో వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసినప్పటికీ, పనులు ఆశించిన వేగంతో సాగడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. నిర్మాణం ఆలస్యం కావడంతో ఆస్పత్రికి వచ్చే గర్భిణులు, వారి కుటుంబ సభ్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అంటున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులను ప్రశ్నించగా, ప్రసూతి వార్డు నిర్మాణ పనులను వేగవంతం చేసినట్లు తెలిపారు. మిగిలిన పనులను పూర్తి చేసి ఈ ఏడాది డిసెంబర్ నాటికి భవనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని అధికారులు వెల్లడించారు. ప్రసూతి వార్డు నిర్మాణం పూర్తయితే నరసన్నపేటతో పాటు పరిసర ప్రాంతాల గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని వైద్య వర్గాలు భావిస్తున్నాయి. పనులు మరింత ఆలస్యం కాకుండా నిర్దేశిత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.



## నీట్ పేపర్ లీక్ బాధిత కుటుంబాలకు రూ. కోటి పరిహారం ఇవ్వాలి

**- ఎన్‌టీఏను రద్దు చేసి పరీక్షల నిర్వహణ రాష్ట్రాలకు అప్పగించాలి**

**-ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యుగంధర్**




**పలాస, జులై 29 (వార్త):** నీట్ పరీక్షల ప్రశ్నపత్రం లీకేజీ ఘటనల నేపథ్యంలో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. కోటి చొప్పున పరిహారం చెల్లించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొజ్జాడ యుగంధర్ డిమాండ్ చేశారు. ఎన్‌టీఏను రద్దు చేసి పరీక్షల నిర్వహణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని ఆయన కోరారు. ఈ డిమాండ్లతో బుధవారం సాయంత్రం పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం విద్యార్థుల మృతికి నివాళులర్పించి మాట్లాడిన యుగంధర్, విద్యా వ్యవస్థలో చోటుచేసుకుంటున్న అక్రమాలను అరికట్టి సమగ్ర ప్రక్షాళన చేపట్టాలని అన్నారు. నీట్ పరీక్షల లీకేజీ ఘటనలపై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆందోళన నిర్వహించిన వారిపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్‌టీఏతో పాటు జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)ను రద్దు చేసి, 2020లో అమల్లోకి తీసుకొచ్చిన విద్యా విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రవి, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాస్, ఏఐఎస్ఎఫ్ నాయకులు సాయి, హేమసుందర్, గిరి, చంటి, ఏఐవైఎఫ్ నాయకులు వాసు, వెంకటరావు, విజయ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్ పర్యటన విజయవంతం చేయాలి

**-వైఎస్సార్ సీపీ యువజన మండల ఉపాధ్యక్షుడు గుసిరి వెంకటరావు**



**మందస, జులై 29(వార్త):** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శ్రీకాకుళంలో ఈ నెల 30న పర్యటించనున్నారని, ఈ పర్యటనను విజయవంతం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన మండల ఉపాధ్యక్షుడు, మూలిపాడు మాజీ సర్పంచ్ గుసిరి వెంకటరావు పిలుపునిచ్చారు. మందస పట్టణంలో వెంకటరావు విలేకరులతో మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి జిల్లా పర్యటనకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ప్రతి పక్షాల గొంతు నొక్కాలని ప్రయత్నిస్తున్న అధికార పార్టీ అక్రమాలపై జగన్ ప్రశ్నిస్తారన్నారు. దీనిలో భాగంగా మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుతో ములాఖత్ అవుతారన్నారు. మాజీమంత్రి సీదిరిపై ప్రజాస్వామ్య విరుద్ధంగా కేసులు బనాయించి, జైలులో పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అక్రమాలను ప్రశ్నించినందుకే అప్పలరాజుపై అక్రమ కేసులు పెట్టారన్నారు. మాజీ సీఎం జగన్ రాకతో సమస్య తీవ్రత బయట ప్రపంచానికి తెలుస్తుందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జగన్ పర్యటనను విజయవంతం చేయాలని వెంకటరావు కోరారు.

## పశువుల అక్రమ రవాణాను అడ్డుకున్న ఎస్ఐ కృష్ణప్రసాద్

**- రెండు వాహనాలు స్వాధీనం**



**మందస, జులై 29(వార్త):** పశువుల అక్రమ రవాణాను మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ అడ్డుకుంటున్నారు. జాతీయ రహదారిపై ఈ అక్రమ రవాణా కొనసాగుతోంది. ఎస్ఐ కృష్ణప్రసాద్ ఎంతో చాకచక్యంగా వ్యవహరిస్తూ పశువుల అక్రమ రవాణా రాకెట్ ఛేధిస్తున్నారు. అదేవిధంగా మందస మండలంలోని జాతీయ రహదారిపై బుధవారం రాత్రి ప్రత్యేక దాడులు నిర్వహించిన ఎస్ఐ కృష్ణప్రసాద్ పశువులను అక్రమంగా తరలిస్తున్న రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మందస మండలంలోని మఖరజోల గ్రామం సమీపంలో జాతీయ రహదారిపై ఈ రెండు వాహనాలను అడ్డుకోగా.. ఒక వాహనంలో 12 పశువులు, మరో వాహనంలో 5 పశువులను ఉన్నట్టు ఎస్ఐ కృష్ణప్రసాద్ చెప్పారు. వాహనాల్లో స్వాధీనం చేసుకున్న పశువులను ఇదే మండలంలోని అంబుగాం వద్ద ఏర్పాటు చేసి, గో సంరక్షణశాలకు తరలించామని ఆయన చెప్పారు. స్వాధీనం చేసుకున్న రెండు వాహనాలపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు. వాహనాలను సంబంధించిన వివరాలు, డ్రైవర్, క్లీనర్, సిబ్బంది వివరాలను సేకరిస్తున్నామన్నారు. పశువుల అక్రమ రవాణా నేరమని, పశువులను అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కూటికుప్పల కృష్ణప్రసాద్ హెచ్చరించారు.






# రాజకీయ కక్షతోనే అక్రమ కేసులు

**- మాజీమంత్రి సీదిరిపై అక్రమ కేసులతో ప్రజాస్వామ్యంపై దాడి**

**- చట్టాన్ని అధికార పార్టీకి ఆయుధంగా మార్చొద్దు**

**- వైఎస్సార్ సీపీ నాయకులు హెచ్చరిక**

**మందస, జులై 29(వార్త):** రాజకీయ కక్షతోనే అక్రమ కేసులు బనాయించి, ప్రజాస్వామ్యంపై దాడి చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన నారాయణపురంలో పార్టీ ప్రత్యేక సమావేశం మడియా రామక్రిష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుపై అక్రమ కేసులతో ప్రజాస్వామ్యంపై దాడి చేస్తున్నారని ధ్వజమెత్తారు. చట్టాన్ని అధికార పార్టీకి ఆయుధంగా మార్చొద్దని హెచ్చరించారు. పలాస నియోజకవర్గంలో నమోదైన కేసుల వ్యవహారంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పలాసకు చెందిన దుబ్బ దానయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం అత్యంత విషాదకరమని, ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రమాదానికి బాధ్యులెవరైనా ఉంటే చట్టప్రకారం నిష్పాక్షికంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. తమ అభిప్రాయం ప్రకారం సాధారణ రోడ్డు ప్రమాదంగా కనిపించే ఘటనను రాజకీయ కక్షసాధింపుతో హత్య కేసుగా చిత్రీకరించి మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, ఆయన కుమారుడు ఆరవ్ వర్మతో పాటు సిద్ధార్థపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలకు, న్యాయసూత్రాలకు విరుద్ధమని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రతీ రోజూ అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రతీ ప్రమాదాన్ని ఇదే విధంగా హత్య కేసుగా నమోదు చేస్తున్నారా? ఒకే చట్టం అందరికీ సమానంగా అమలు కావాల్సి ఉండగా, రాజకీయ అనుబంధాలను బట్టి కేసుల స్వరూపం మారుతుందనే భావన ప్రజల్లో కలిగితే అది న్యాయవ్యవస్థపై విశ్వాసాన్ని దెబ్బతీసే పరిస్థితి అవుతుందన్నారు. ఇటీవల జరిగిన ఇతర ప్రమాదాల్లో ఇదే ప్రమాణాలు అమలు కాలేదని వారు విమర్శించారు. చట్టం రాజ్యాంగం ప్రకారం నడవాలి... అధికార పార్టీ సంకేతాలతో కాదు. పోలీసులు చట్టానికి జవాబుదారులు కావాలి... రాజకీయ ఆదేశాలకు కాదు. దర్యాప్తు సంస్థలు అధికార పార్టీ ప్రతీకార రాజకీయాలకు సాధనంగా మారితే ప్రజాస్వామ్యానికి అది అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. ప్రజా సమస్యలపై నిరంతరం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును రాజకీయంగా అణగదొక్కాలనే ఉద్దేశంతోనే ఈ చర్యలు జరుగుతున్నాయనే అనుమానాన్ని వ్యక్తం చేశారు. ముందుగా ఆయన కుమారుడు ఆరవ్ వర్మను రిమాండ్‌కు పంపి, అనంతరం అదే కేసులో డాక్టర్ సీదిరి అప్పలరాజును నిందితుడిగా చేర్చి అరెస్టు చేయడం రాజకీయ కక్షసాధింపుగా కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు. ప్రతిపక్ష నాయకులను కేసులతో భయపెట్టవచ్చేమో కానీ, ప్రజల గొంతును అణచివేయలేరని, అధికారం శాశ్వతం కాదన్నారు. కానీ చట్టంపై ప్రజల నమ్మకం శాశ్వతంగా నిలవాలని, రాజకీయ ప్రయోజనాల కోసం చట్టాలను వక్రీకరించే ప్రయత్నాలను వెంటనే విరమించి, ఈ కేసులో నిష్పాక్షికంగా వ్యవహరించాలని ప్రభుత్వం, పోలీసు యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, పార్టీ అధ్యక్షుడు దల్లి జానకిరావురెడ్డి, జిల్లా కార్యదర్శి అగ్గున్న సూర్యారావు పార్టీ నాయకులు అందాల శేషగిరి, సొర్ర ఢిల్లీరావు, సేనాపతి దివ్య, మడియా రామక్రిష్ణ, మార్పు వెంకటరమణ, మట్ట జయరాం, గొరకల కేశవరావు, బత్తిని లక్ష్మణ్, పులారి పీతారంబం, బత్తిని వెంకటరావు, మామిడి సింహాద్రి, పులారి కూర్మారావు, పొట్టి ధర్మారావు, గొలుసు చంద్రశేఖరం, తిమ్మల క్రిష్ణారావు, మామిడి క్రిష్ణారావు, బత్తిని చిరంజీవులు, దుంపల వైకుంఠరావు, కర్రి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# టోకెన్లు ఉన్నాయ్.. ఎరువులేవీ..?



**కొత్తూరు, జులై 29 (వార్త):** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ‘‘రైతన్నా×మీ’’ యాప్ ద్వారా రైతులకు అందాల్సిన యూరియా, డీఏపీ వంటి ఎరువుల పంపిణీలో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతోందని, కొత్తూరు మండల సహకార సంఘం (సొసైటీ) అధికారి నాగరాజుపై వ్యవసాయ శాఖ, జిల్లా సహకార శాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం కొత్తూరు మండలంలోని కర్లెమ్మ, కొత్తూరు రెవెన్యూ పరిధిలో రైతులకు డీఏపీ ఎరువుల పంపిణీ కోసం వ్యవసాయ శాఖ అధికారులు టోకెన్లు జారీ చేసి, ‘‘రైతన్నా×మీ’’ యాప్‌లో నమోదు చేశారు. అయితే, నమోదు చేసుకున్న రైతులకు ఎరువులు పంపిణీ చేయకుండా సొసైటీ అధికారి నాగరాజు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. రైతులతో బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని కూడా విమర్శించారు. సుమారు 300 బస్తాల డీఏపీ పంపిణీకి టోకెన్లు జారీ చేసినప్పటికీ, అనేక మంది రైతులకు ఎరువులు ఇవ్వకుండా సమయం అయిపోయింది, స్టాక్ లేదు అని చెప్పడం పూర్తిగా అన్యాయమన్నారు. ఇప్పటికే టోకెన్లు పొంది, ఆన్‌లైన్‌లో నమోదు పూర్తిచేసుకున్న రైతులను నిరాశపరచడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే జోక్యం చేసుకుని రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ తదితర ఎరువులను సకాలంలో అందించాలని, సొసైటీ అధికారి నాగరాజు వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సిర్ల ప్రసాద్, రైతు నాయకుడు పెదకోట యతిరాజు ఆధ్వర్యంలో రైతులు కొత్తూరు మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్. సుమంత్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ, 20:20 వంటి ఎరువులను ప్రభుత్వం తగినంతగా సరఫరా చేసి ఎలాంటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన వ్యవసాయ శాఖ అధికారి ఎస్. సుమంత్ మాట్లాడుతూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు జనార్ధన్, ఎండు, లక్ష్మణ్, రామారావు, శ్రీను, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్ పర్యటన విజయవంతం చేయండి



**ఇచ్ఛాపురం, జులై 29 (వార్త):** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి శ్రీకాకుళం జిల్లా పర్యటన పురస్కరించుకొని ఇచ్ఛాపురం నియోజకవర్గ వైస్సార్సీపీ సమన్వయకర్త సాడి శ్యామ్ ప్రసాద్ రెడ్డి నేతృత్వంలో ఇచ్ఛాపురం పార్టీ కార్యాలయం లో పార్టీ ముఖ్యులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమ షెడ్యూల్ ప్రకారం జగన్మోహన్ రెడ్డి శ్రీకాకుళం జిల్లా జైలు అంపోలు వద్దకు మధ్యాహ్నం 2.00 గంటలకు చేరుకుంటున్న నేపథ్యంలో ఇచ్ఛాపురం నుంచి 10 గంటలకు బయలుదేరి కార్యకర్తలందరినీ అంపోలు వద్దకు చేర్చాలని చెప్పారు. ప్రతి గ్రామానికి, ప్రతి కార్యకర్తకు తప్పనిసరిగా సమాచారం చేర్చాలని కోరారు. జగన్మోహన్ రెడ్డి పైనున్న క్రేజ్ కారణంగా ఆసక్తి గల యువకులకు, సోషల్ మీడియా యువకులకు ఎక్కువ మందికి సమాచారం అందించాలని అందుకోసం మండలం లోని పార్టీ పెద్దలు భాధ్యత తీసుకోవాలని పెద్దలకు తెలియజేసారు. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్సీ నర్తు రామారావు, వైస్సార్సీపి బిసి విభాగం రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, మహిళా విభాగం అధ్యక్షులు ఉలాల భారతీ దివ్య, ఇచ్ఛాపురం, కంచిలి ఎంపీపీ లు బోర పుష్ప, పైల దేవదాసు రెడ్డి, కంచిలి, సోంపేట జడ్పీటీసీ ప్రతినిధులు ఇప్పిలి కృష్ణారావు, తడక జోగారావు, ప్రత్తి అన్వేష్, సాలిన గాంధీ ఇచ్ఛాపురం మండల పార్టీ అధ్యక్షులు ఆశి కృష్ణారెడ్డి, నీలాపు జగదీష్, ఆశి పురుషోత్తం రెడ్డి, సుగ్గు ప్రేమ్ కుమార్, లోపింటి దీనభందు,సాలిన ఢిల్లీ, దుర్గాసి ధర్మారావు, వడ్డిన తేజ,కొనపల సురేష్, గణప సింహాచలం, బుడ్డ కళ్యాణ్, మునకాల వీరాస్వామి, పాతిర్ల వెంకటేష్, బోరుపద్ర పాపయ్య, గానాల దుర్యోధన, ప్రకాష్ మహాపాత్రో, కోరికాన లక్ష్మీనారాయణ, ఈగల దేవదాసు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా గురుపూర్ణిమ వేడుకలు

**- అలరించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు**

**- 6వేల మందికి సాయినారాయణ సేవ**



**మందస, జులై 29(వార్త):** మందసలోని శ్రీషిరిడిసాయి ధ్యానమందిరంలో గురుపూర్ణిమ వేడుకలు ఘనంగా జరిగాయి. అదేవిధంగా ఆలయ 27 వార్షికోత్సవ ఆధ్యాత్మిక కార్యక్రమాలు కూడా వైభవంగా నిర్వహించారు. శ్రీషిరిడిసాయి ధ్యానమందిరం వ్యవస్థాపకులు గిన్ని తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కొమ్మాజోస్యుల సీతారామశర్మ(రవిసాయి) ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున ఓంకార సుప్రభాత తొలిహారతి, మంగళస్నానములు, క్షీరాభిషేకంతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. విఘ్నేశ్వరపూజ, పుష్పాభిషేకం, బాబావారి అష్టోత్తర శతనామావళి జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో వెంటరాగా.. గిన్ని తిరుపతిరెడ్డి చేతుల మీదుగా పూర్ణకుంభంతో ఊరేగింపు, చావడి ఉత్సవం జరిగింది. మధ్యాహ్నం సుమారు 5వేల మందికి అన్నదానం నిర్వహించారు. మహేంద్ర కళామండలి సౌజన్యంతో జరిగిన సంగీతమాధురి గానకచేరి భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. కళాకారులకు సన్మానించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మందస మారుమోగింది. ఈ సందర్భంగా గురువులకు, అధికారులకు, ఆధ్యాత్మికవేత్తలు, భక్తులు, సంఘసేవకులను గిన్ని తిరుపతిరెడ్డి ఘనంగా సన్మానించారు. శేజహారతితో కార్యక్రమాలు ముగించారు. శ్రీసాయినాథుని గురపూర్ణిమ వేడుకలు నభూతో నభవిష్యత్ అన్న చందాన జరిగాయి.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546